సాక్షి
ఖమ్మం
మంగళవారం । 26 । మార్చి । 2024



పర్యాటకంపై పట్టింపేది?
పాలేరు రిజర్వాయర్‌తో పాటు పరిసరాల్లో పర్యాటక రంగ అభివృద్ధిని విస్మరించడంతో ప్రజలకు నిరాశ ఎదురవుతోంది.
8లో



పులి కలకలం!
చింతకాని మండలం వందనంలో పెద్దపులి తిరుగుతోందన్న వదంతుల్లో వాస్తవం లేదని అధికారులు నిర్ధారించారు.
8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
39°/23°
జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు గరిష్టస్థాయిలో నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (మంగళవారం సా॥) 6.27
సహర్ (బుధవారం ఉ॥) 4.46

కూడలిలో కామ్రేడ్స్!



రాష్ట్రంలో ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో పట్టున్న సీపీఎం, సీపీఐ పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తు కోసం వేచిచూస్తున్నాయి. బీఆర్‌ఎస్‌తో వెళ్లేది లేదని ఖరాఖండిగా చెబుతూనే కాంగ్రెస్ స్నేహ హస్తం కోసం ఎదురుచూస్తున్నాయి. ఉభయ పార్టీల ప్రతిపాదనపై ఇప్పటివరకు కాంగ్రెస్ స్పందించకపోవడంతో కామ్రేడ్స్ అసహనంతో ఉన్నట్లు తెలుస్తోంది. సీపీఎం ఇప్పటికే నిరీక్షణను పక్కనపెట్టి భువనగిరి అభ్యర్థిని ప్రకటించడమే కాక మిగతా స్థానాల్లో ఎలా ముందుకెళ్లాలన్న అంశంపై సమాలోచనలు చేస్తోంది. సీపీఐ మాత్రం దేశవ్యాప్తంగా ఇండియా కూటమిలో ఉన్నందున రాష్ట్రంలో ఒక్క ఎంపీ స్థానమైనా తమకు ఇవ్వాలని పట్టుబడుతోంది. ఆ దిశగా కాంగ్రెస్ పార్టీ చర్చలకు పిలవకపోవడంతో ఈనెలాఖరు నాటికి ఒక నిర్ణయం తీసుకునే అవకాశముంది.

–సాక్షి ప్రతినిధి, ఖమ్మం

స్నేహంపై 'హస్తం' స్పందన కరువు

- ఒక్క ఎంపీ సీటైనా ఇవ్వాలని సీపీఐ ప్రతిపాదన
- పార్టీ కోరిన ఐదు స్థానాల్లో రెండు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన
- ఖమ్మంలో ఎలా ముందుకు వెళ్లాలన్న అంశంపై ఆలోచన
- మరోవైపు భువనగిరిలో అభ్యర్థిని ప్రకటించిన సీపీఎం
- జాతీయ నాయకత్వాల సూచనతో ఈ నెలాఖరుకు స్పష్టత

సీపీఎం ముందస్తు అడుగులు

ఇండియా కూటమిలో భాగంగా రాష్ట్రంలో పట్టున్న ప్రాంతాల్లో తాము పోటీ చేస్తామని సీపీఎం చేసిన ప్రతిపాదనపై కాంగ్రెస్ నుంచి నిర్ణయం వెలువడలేదు. దీంతో ఆ పార్టీ భువనగిరి లోక్‌సభ స్థానంలో తమ అభ్యర్థిగా జహంగీర్‌ను ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా సీపీఎం తొలుత బీఆర్‌ఎస్‌తో.. ఆతర్వాత కాంగ్రెస్‌తో పొత్తుకు సై అన్నా కుదరలేదు. ఆ పార్టీ పోటీ చేయాలనుకున్న అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించేయడంతో సీపీఎం సైతం తమ పార్టీ అభ్యర్థులను దింపింది. జిల్లాలోని పాలేరు, వైరా స్థానాల్లో ఇదే జరిగింది. ఇక లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ నుంచి స్పందన రాకపోవడంతో భువనగిరిలో పార్టీ అభ్యర్థిని ప్రకటించి ముందడుగు వేసింది. సీపీఎం ప్రతిపాదించిన పార్లమెంట్ స్థానాల్లో ఖమ్మం కూడా ఉండగా.. ఇక్కడ కూడా పోటీ చేస్తుందా.. ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తుందా.. అన్న అంశంపై ఈనెల 31న జరిగే రాష్ట్ర కమిటీ భేటీలో నిర్ణయించనున్నట్లు తెలిసింది.

వేచిచూసే ధోరణిలో సీపీఐ

అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది. రాష్ట్రంలో నాలుగైదు స్థానాల్లో పోటీకి సిద్ధమైనా, కొత్తగూడేనికే పరిమితమైంది. ఈ స్థానం నుంచి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పోటీకి దిగి గెలిచారు. ఇక పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం, భువనగిరి, వరంగల్, నల్లగొండ, పెద్దపల్లి స్థానాల్లో పోటీ చేస్తామని కాంగ్రెస్‌కు ప్రతిపాదించగా.. ఆ పార్టీ స్పందించకపోగా నల్లగొండ, పెద్దపల్లి స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. ఇక సీపీఐ కోరుతున్న స్థానాల్లో ఖమ్మం, భువనగిరి, వరంగల్ మిగిలి ఉండగా.. తాము అడిగిన స్థానాల్లో ఒక్కటైనా ఇవ్వకపోతే ఎలా అంటూ ఇటీవల సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అసహనం వ్యక్తం చేశారు. తాజాగా జరిగిన పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలోనూ పోటీపై చర్చ జరిగినట్లు సమాచారం. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్నందున సీపీఐ జాతీయ నాయకత్వం ఇచ్చే సూచనలతో ముందుకు వెళ్లాలనే భావనతో ఆ పార్టీ నేతలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఎవరి ప్రభావం ఎంత ?

గత పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఎం, సీపీఐ కలిసి పోటీ చేశాయి. సీపీఎం నల్లగొండ, ఖమ్మం స్థానాల్లో.. సీపీఐ మహబూబాబాద్, భువనగిరిలో పోటీ చేసినా ఫలితం దక్కలేదు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం ఉమ్మడి జిల్లాలో ఒంటరిగా, సీపీఐ కాంగ్రెస్‌తో జత కట్టాయి. ఆ ఎన్నికల్లో నమోదైన ఓట్ల ఆధారంగా పార్లమెంట్ ఎన్నికల్లో ఈ పార్టీల ప్రభావం ఎంత మేరకు ఉంటుందన్న అంశంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఓ వైపు కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ అభ్యర్థిని ప్రకటించగా.. నేడో, రేపో ఖమ్మం అభ్యర్థిని కూడా ప్రకటించే అవకాశముంది. దీంతో సీపీఎం భువనగిరి ఒక్క స్థానానికే పరిమితమవుతుందా, ఖమ్మంలోనూ పోటీ చేస్తుందా అన్నది తేలాల్సి ఉంది. పోటీలో ఆ పార్టీ అభ్యర్థిని పెట్టకపోతే కాంగ్రెస్‌కు ఎన్ని ఓట్లు కలిసొస్తాయన్న చర్చ జరుగుతోంది. ఇక సీపీఐ నేతలు జాతీయ నాయకత్వం నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో ఒక్క స్థానంలోనైనా పోటీ చేయకపోతే కేడర్ బలహీనమవుతుందన్న ఆలోచనలో నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా బీజేపీని నిలువరించడమే లక్ష్యంగా తమ అడుగులు ఉంటాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

హోరెత్తిన హోలీ సంబురం!



కొణిజర్ల మండలం రాజ్యాతండాలో హోలిక దహనం చేస్తున్న గిరిజనులు



జిల్లావాసులు హోలీ పర్వదినాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. అర్ధరాత్రి దాటాక పలు ప్రాంతాల్లో కాముడు, హోలికా దహనం నిర్వహించారు. ఆతర్వాత ఉదయమే చిన్నాపెద్ద తేడా లేకుండా కూడళ్లకు చేరుకుని రంగులు పూసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. కొన్నిప్రాంతాల్లో ప్రత్యేక ఈవెంట్లు నిర్వహించగా ఆటపాటలతో సందడి చేశారు. శాఖల వారీగా ఉద్యోగులు సహచరుల ఇళ్లకు వెళ్లి రంగులు పూశారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆధ్వర్యాన హోలీ సంబురాలు నిర్వహించగా.. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ పరస్పరం రంగులు చల్లుకున్నారు. ఇక పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జరిగిన హోలీ వేడుకల్లో సీపీ సునీల్‌దత్ – నిశితశర్మ సందడి చేశారు. ఆతర్వాత ఉద్యోగులతో కలిసి సీపీ ఉత్సాహంగా రంగులు చల్లుతూ నృత్యం చేస్తూ సంబురాల్లో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సీపీ సునీల్‌దత్‌కు రంగు పులుముతున్న కలెక్టర్ గౌతమ్

న్యూస్‌రీల్

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణకు 28న కౌన్సెలింగ్

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో మూడు నెలల ఫౌండేషన్ కోర్సుతో పాటు రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలు, గ్రూప్–1 ప్రిలిమ్స్‌కు రెసిడెన్షియల్ విధానంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. వంద మంది ఎస్సీ అభ్యర్థులకు మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం దరఖాస్తు చేసుకున్న వారే కాక దరఖాస్తు చేసుకోని గ్రాడ్యుయేట్లు సైతం ఈనెల 28న స్టడీ సర్కిల్‌లో ఉదయం 10గంటలకు మొదలయ్యే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 98484 94290 నంబర్‌లో సంప్రదించాలని డీడీ తెలిపారు.

కిన్నెరసానిలో హోలీ సందడి!



స్పీడ్‌బోటుపై షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన మండలంలోని కిన్నెరసానిలో సోమవారం హోలీ పర్వదినం సందర్భంగా సందడి నెలకొంది. జిల్లా నలుమూలల నుంచే కాక పొరుగు జిల్లాల నుంచి సైతం పర్యాటకులు కుటుంబాలతో కిన్నెరసానికి వచ్చారు. ఈసందర్భంగా డ్యామ్ పైనుంచి జలాశయం, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించిన వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. ఈమేరకు 382 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖ రూ.11,045, 220మంది బోట్‌షికారు చేయడంతో టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.10,120 ఆదాయం లభించిందని నిర్వాహకులు తెలిపారు.

అర్బన్ పార్క్‌ను సందర్శించిన ట్రెయినీ బీట్ ఆఫీసర్లు



వన్యప్రాణుల వివరాలు వెల్లడిస్తున్న దీపక్ నారాయణ్

సత్తుపల్లిటౌన్: హైదరాబాద్‌లోని దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 60 మంది బీట్ ఆఫీసర్లు సోమవారం సత్తుపల్లి నీలాద్రి అర్బన్ పార్క్‌ను సందర్శించారు. పార్క్‌లోని మొక్కలతో పాటు వన్యప్రాణులు, వాటి స్వభావాలను సింగరేణి వైల్డ్‌లైఫ్ నిపుణుడు దీపక్ నారాయణ్ వారికి వివరించారు. అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్, డీఆర్‌ఓ ముత్యాలరావు, ఎఫ్‌బీఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన వినోద్‌రావు



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వినోద్‌రావు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా తాండ్ర వినోద్‌రావును ఆదివారం అధిష్టానం ప్రకటించిన విషయం విదితమే. ఈసందర్భంగా ఆయన సోమవారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో పాటు మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, వినోద్‌రావుకు టికెట్ ప్రకటించడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అధిష్టానం సూచన మేరకు ఆయన విజయానికి కలిసికట్టుగా కృషి చేస్తామని తెలిపారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ఎంపికకు నేడు, రేపు పోటీలు

పాల్వంచరూరల్: ఉమ్మడి జిల్లాలోని క్రీడాపాఠశాలల్లో విద్యార్థుల ఎంపికకు మంగళ, బుధవారాల్లో తుది పోటీలు నిర్వహించనున్నట్లు క్రీడల అధికారి బొల్లి గోపాల్‌రావు తెలిపారు. కిన్నెరసానిలోని బాలుర, కాచనపల్లిలోని బాలికల క్రీడాపాఠశాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు ఈనెల 5, 6వ తేదీల్లో ఉమ్మడి జిల్లా స్థాయిలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు 26, 27వ తేదీల్లో చివరి దశ పోటీలు నిర్వహించనున్నారు. ఈమేరకు బ్యాటరీ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మంగళవారం ఉదయం 8గంటలకల్లా కిన్నెరసాని క్రీడాపాఠశాలకు చేరుకోవాలని, వివరాలకు 96185 15907, 99123 62053 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల పనుల్లో వేగం

- ఎపిక్ కార్డుల పంపిణీకి కసరత్తు
- పోస్టల్ శాఖకు 35,837కార్డులు



ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో జిల్లా యంత్రాంగం పనుల్లో వేగం పెంచింది. ఓటర్ల నమోదుపై దృష్టి సారించడమే కాక పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన, ఉద్యోగుల శిక్షణపై దృష్టి సారించారు. అలాగే, కొత్తగా నమోదైన ఓటర్లకు గుర్తింపు కార్డు(ఎపిక్ కార్డు)లు జారీ చేసేందుకు చర్యలు చేపట్టారు.

దఫాలుగా...

జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో అసెంబ్లీ ఎన్నికల సమయాన కొత్తగా ఓటుహక్కు నమోదు చేసుకున్న వారికి అప్పట్లోనే ఎపిక్ కార్డులు చేరవేశారు. ఆతర్వాత కొత్తగా నమోదు చేసుకున్న వారితో పాటు మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి కార్డులు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే అధికార యంత్రాంగానికి 52,987కార్డులు చేరాయి. ఇందులో 17,150కార్డులను ఇప్పటికే ఓటర్లకు అందించగా మరో 35,837కార్డులు పోస్టల్ శాఖ ద్వారా బట్వాడాకు సిద్ధమయ్యాయి. ఇంకా కొత్త ఓటర్లకు సంబంధించి 41,013 కార్డులు ప్రింటింగ్ నుంచి ఒకటి, రెండురోజుల్లో రానుండగా అవి కూడా పోస్టల్ శాఖకు అప్పగించి చేరవేస్తారు. కాగా, ఓటరు జాబితాలో పేరు ఉన్న అందరికీ గుర్తింపు కార్డులు వీలైనంత త్వరగా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయాన వంద శాతం కార్డులు చేరవేయగా.. ఈసారి కూడా త్వరగా అందించేలా కృషి చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

దివ్యాంగ ఓటర్లు 30,439మంది

- ఇంటి నుంచే ఓటు వేసేందుకు అవకాశం
- ఫాం–12డీ ద్వారా దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: వంద శాతం ఓటింగ్ నమోదు చేయడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం ఏటా కొత్త సంస్కరణలు తీసుకొస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం అమలుచేసిన 'హోం ఓటింగ్' సత్ఫలితాలను ఇవ్వడంతో లోక్‌సభ ఎన్నికల్లోనూ అమలుకు సిద్ధమవుతోంది. గతంలో పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగుల కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించి వీల్‌చైర్లు, ర్యాంపులు సమకూర్చేవారు. అయినా మిగతా ఓటర్ల క్యూ లైన్ కారణంగా దివ్యాంగులు వేచి ఉండాల్సి వచ్చేది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం కల్పించినట్లుగానే మే 13వ తేదీన జరిగే లోక్‌సభ ఎన్నికలకూ అదే విధానం అమలుచేయనున్నారు.

30,439 మంది

ఖమ్మం పార్లమెంట్ స్థానం ఓటర్ల తుది జాబితాను ఇటీవల విడుదల చేశారు. ఈ జాబితా ఆధారంగా పార్లమెంట్ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 30,439మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నట్లుగా తేలింది. ఖమ్మం, పాలేరు, మధిర, సత్తుపల్లి, వైరా, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లోని వీరి సంఖ్య ఆధారంగా ఇంటి దగ్గర ఓటు వేసేలా సన్నద్ధమవుతున్నారు.

దరఖాస్తు చేసుకుంటే...

ఇంటి దగ్గర నుంచి ఓటు వేయాలనుకునే దివ్యాంగులు ముందుగా ఫారం–12డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తు అందాక సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి హోం ఓటింగ్‌కు అవకాశం కల్పిస్తారు. పోలింగ్‌కు కొద్దిరోజుల ముందు దివ్యాంగ ఓటర్ల ఇంటికే సిబ్బంది వెళ్లి అచ్చం పోలింగ్ కేంద్రం మాదిరి ఏర్పాట్లు చేసి రహస్య విధానంలో ఓటు వేయిస్తారు.



ఇంటి నుంచి ఓటు వేస్తున్న వృద్ధురాలు (ఫైల్)

దివ్యాంగ ఓటర్ల వివరాలు...

నియోజకవర్గం	ఓటర్లు
ఖమ్మం	3,600
పాలేరు	7,570
మధిర	6,011
వైరా	4,119
సత్తుపల్లి	4,744
కొత్తగూడెం	2,077
అశ్వారావుపేట	2,318
మొత్తం	30,439

కల్యాణ క్రతువు షురూ..



పసుపు కొమ్ములు దంచుతున్న ఈఓ, భక్తులు

భద్రాద్రి రామయ్యకు పెళ్లి కళ

- సంప్రదాయబద్ధంగా పసుపు దంచే వేడుక
- స్వామివారికి వైభవంగా వసంతోత్సవం, డోలోత్సవం
- భారీగా హాజరైన భక్తులు



మిథిలా స్టేడియంలో తలంబ్రాలు కలుపుతున్న భక్తులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణోత్సవ క్రతువు సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ప్రతీ జంటకు ఆదర్శంగా నిలిచే కల్యాణ రాముడి పెళ్లికి మహిళలు సంప్రదాయ బద్ధంగా పసుపు కొమ్ములు దంచి శ్రీకారం చుట్టారు. దీంతో పాటు ఏక కాలంలో వసంతోత్సవం, డోలోత్సవం నిర్వహించడంతో మిథిలా స్టేడియం, దేవస్థానంలో సంబరాలు అంబరాన్నంటాయి. వసంతాలు చల్లుకున్న శ్రీ సీతారాములు పెళ్లి జంటగా దర్శనమివ్వడంతో భక్తులు ఆనందోత్సాహాలతో పరవశించారు.

వేడుకగా తలంబ్రాల తయారీ..

ప్రతీ సంవత్సరం ఫాల్గుణ పౌర్ణమి రోజున పసుపు కొమ్ములను దంచి, తలంబ్రాల తయారీతో రామయ్య పెళ్లి పనులకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీ. గతంలో చిత్రకూట మండపంలో ఈ వేడుక నిర్వహించగా.. ఈవో రమాదేవి గతేడాది మిథిలా స్టేడియం ఎదురుగా ఉన్న ఉత్తర ద్వారం వద్దకు మార్చారు. ఈ సంవత్సరం కూడా అక్కడే జరిపించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ పల్లకీ సేవగా స్వామివారి ఉత్సవ మూర్తులను ఉత్తర ద్వారం వద్దకు తీసుకొచ్చి ఆశీనులు చేశారు. అర్చకులు స్వామివారికి, రోళ్లు, రోకళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు, అర్చకుల సతీమణులతో పాటు ఆలయ ఈఓ రమాదేవి తొలుత పసుపు కొమ్ములు దంచి పెళ్లి పనులు ప్రారంభించారు. అనంతరం బియ్యంలో పసుపు, రోజ్‌వాటర్, గులాల్, సుగంధ ద్రవ్యాలు, అత్తర్ వేసి తలంబ్రాలు కలిపారు. వాటిని స్వామివారి మూలమూర్తుల పాదాల చెంతన ఉంచారు. సోమవారం హోలీ సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఇక ఈ వేడుకలు మిథిలా స్టేడియం ఎదుట నిర్వహించడంతో అందరూ కనులారా వీక్షించేందుకు వీలు కలిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు గోటితో ఒలిచి తీసుకొచ్చిన కోటి తలంబ్రాలను స్వామి వారికి సమర్పించారు.

స్వామివారిపై వసంతం చల్లి..

ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ సీతారాములకు వసంతోత్సవం, డోలోత్సవం నిర్వహించడం ఆలయంలో ఆనవాయితీ. ఈ క్రమంలో బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు పంచామృతాలతో కలశాభిషేకం, సహస్రధారతో స్నపనం జరిపించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఊయలపై శ్రీ సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యను ఆశీనులను చేశారు. ఆస్థాన గాయకులు రామదాసు కీర్తనలను ఆలపిస్తుండగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి నక్షత్ర హారతి సమర్పించారు. అర్చకులు శ్రీ సీతారాముల ఉత్సవ విగ్రహాలపై రంగులు చల్లి వసంతోత్సవాన్ని ప్రారంభించారు. పంచరంగుల వసంతాలు పడడంతో శ్రీ సీతారాములకు కల్యాణ శోభ సంతరించుకుంది. అనంతరం అర్చకులు సిబ్బంది, భక్తులపై రంగులు చల్లారు. ఈ సందర్భంగా బేడా మండపం రంగులమయంగా మారింది. భారీగా తరలివచ్చిన భక్తుల రామనామ స్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

సామూహిక లక్ష్మీ పూజలు

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో సోమవారం సామూహిక లక్ష్మీ పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థానం, శ్రీ లక్ష్మీ మహిళా సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని జరిపించగా.. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. పూజలో పాల్గొన్న భక్తులకు లక్ష్మీ అమ్మవారి వెండి ప్రతిమ, జాకెట్ పీస్, కుంకుమ, ప్రసాదాలను అందజేశారు.



వసంతాలతో శ్రీ సీతాలక్ష్మణ సమేతరామచంద్రమూర్తి

క్లుప్తంగా

గల్లంతైన యువకులను కాపాడిన కానిస్టేబుళ్లు



కాపాడిన కానిస్టేబుళ్లతో యువకుడు(ఎడమ)

మణుగూరు టౌన్: పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన ముగ్గురు యువకులు సోమవారం హోలీ ఆడిన అనంతరం శివారు ప్రాంతమైన కొండాయిగూడెం గోదావరిలో స్నానానికి వెళ్లారు. కాలుజారి మునిగిపోతూ కేకలు వేస్తున్న క్రమంలో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుళ్లు వినయ్, సన్నై గమనించారు. వినయ్ గోదావరిలో దూకి వారిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. ధైర్యసాహసాలు ప్రదర్శించి ముగ్గురు యువకుల ప్రాణాలను కాపాడిన కానిస్టేబుళ్లను డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ సతీష్‌కుమార్, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి, మహబూబాబాద్ పార్లమెంట్ యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జి ధనసరి సూర్య, అధికారులు అభినందించారు.

బాండ్ల చెల్లింపులో జాప్యంపై విచారణ చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీ కార్మికులకు బాండ్ల చెల్లింపు జాప్యంపై విచారణ జరిపించాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పద్మాకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులకు 2013 వేతన సవరణ బకాయిలకు సంబంధించి బాండ్ల నగదు చెల్లించాలని సీఎం ఆదేశించి 40 రోజులు దాటినా చెల్లించకపోవడం సరికాదని పేర్కొన్నారు. ఆర్టీసీ యాజమాన్యం సైతం ఈనెల 11నుంచి చెల్లింపులు జరపాలని సర్క్యులర్ విడుదల చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇకనైనా స్పందించి ఆర్టీసీ కార్మికుల బాండ్ల నగదు వెంటనే చెల్లించాలని పద్మాకర్ కోరారు.

90 బాటిళ్ల మద్యం సీజ్

ఖమ్మం క్రైం: ఖమ్మం స్టేషన్‌రోడ్డు ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన 90 మద్యం బాటిళ్లను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సోమవారం స్వాధీనం చేసుకుంది. హోలీ పండుగ సందర్భంగా సోమవారం వైన్స్, బార్లను మూసివేయించారు. అయితే, ఓ వైన్స్‌షాప్‌కు సంబంధించిన మద్యాన్ని పక్కన పాన్‌షాప్‌లో ఉంచి విక్రయిస్తున్నారనే సమాచారంతో స్వాధీనం చేసుకున్నట్లు స్క్వాడ్ అధికారులు వెల్లడించారు.

ఇల్లెందులో...

ఇల్లెందు: మండలంలోని రొంపేడు గ్రామానికి చెందిన తాటి శేఖర్ మద్యం విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. బెల్టు షాపులోని మద్యం సీజ్ చేశామని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సందీప్ తెలిపారు.

బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌పై కాంగ్రెస్ కార్యకర్తల దాడి



చాంద్‌పాషాను పరామర్శిస్తున్న చైర్మన్ మహేష్, తదితరులు

సత్తుపల్లి: రాజకీయ కక్షల నేపథ్యాన సత్తుపల్లి బీఆర్‌ఎస్ కౌన్సిలర్ ఎస్.కే.చాంద్‌పాషాపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. సత్తుపల్లిలో సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలు బాధితుడి కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఎనిమిదో వార్డు కౌన్సిలర్ చాంద్‌పాషా సోమవారం రాత్రి తన మెకానిక్ షెడ్ మూసేసి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. ఈక్రమంలో వేంసూరు రోడ్డులోని పెట్రోల్ బంక్ సమీపాన ఆయన వాహనాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు ద్విచక్ర వాహనాలతో వచ్చి అడ్డుకున్నారు. దుర్భాషలాడుతూ సుమారు పది మంది దాడి చేయడంతో చాంద్‌పాషా గాయపడ్డాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆయనను ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు చాంద్‌పాషాను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఫోన్‌లో పరామర్శించి ఘటన వివరాలు ఆరా తీశారు. అలాగే, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్.కే.రఫీ, వల్లభనేని పవన్ తదితరులు ఆస్పత్రిలో ఆయనను పరామర్శించారు. కాగా, ఘటనాస్థలి సమీపంలో సీసీ కెమెరాల ఫుటేజీని నాయకులు పోలీసులకు అందజేశారు.

నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్లు..

ప్రైవేట్ ఆస్పత్రి యజమాన్యంపై కేసు

ఖమ్మంక్రైం: నిబంధనలకు విరుద్ధంగా జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అబార్షన్లు చేస్తున్నారని తేలడంతో యజమాన్యంపై ఖమ్మం టూటౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ బాలకృష్ణ కథనం ప్రకారం.. వైరారోడ్డు ప్రాంతంలో కొంతకాలంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణ కూడా లేకుండా ధనార్జనే ధ్యేయంగా నర్సుల చేత అబార్షన్లు చేయిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో టాస్క్‌ఫోర్స్ అధికారుల ఆధ్వర్యాన తనిఖీలు చేయించగా నిజమేనని తేలడంతో యాజమాన్యంపై కేసు నమోదు చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,045

పర్యాటకంపై పట్టింపేది?

- పాలేరులో అభివృద్ధికి అన్ని అవకాశాలు ఉన్నా నిర్లక్ష్యం
- ఒకప్పుడు పర్యాటకులతో కళకళ
- ఆ తర్వాత నిరాదరణతో శిథిలమైన పార్క్‌లు
- ఇకనైనా ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజల వినతి



పార్క్‌లోని ఫౌంటేన్ల దుస్థితి

కూసుమంచి: జిల్లాలో పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అవకాశమున్న ప్రాంతాల్లో కూసుమంచి మండలంలోని పాలేరు రిజర్వాయర్ ఒకటి! ఈ ప్రాంతం ఒకప్పుడు పర్యాటకులతో కళకళలాడేది. కానీ ఆతర్వాత పర్యాటక శాఖ అధికారులు పట్టించుకోకపోవడం.. అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయకపోవడంతో మునుపటి కళ కోల్పోయి పర్యాటకులకు నిరాశ ఎదురవుతోంది. పాలేరులో ఉన్న పార్కులు మూతపడగా.. పర్యాటకుల రద్దీ తగ్గి పర్యాటక శాఖ ఆదాయం కోల్పోతుందని తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. వేసవి సెలవులు సమీపిస్తున్నందున ఇకనైనా దృష్టి సారిస్తే జిల్లా కేంద్రానికి సమీపాన ఉన్న పాలేరు మళ్లీ పర్యాటకులతో కళ సంతరించుకునే అవకాశముంటుంది.

అందమైన పార్క్‌లతో ఆహ్లాదం

పాలేరు రిజర్వాయర్ వద్ద దశాబ్ద కాలానికి ముందు అందమైన పార్క్‌లు ఉండేవి. ఓ వైపు రిజర్వాయర్‌లో పిల్లగాలుల నడుమ బోటింగ్.. మరోపక్క పార్క్‌ల్లో పచ్చదనంతో ఆహ్లాదమైన వాతావరణం.. పర్యాటకులను మైమరిపించేవి. ప్రధానంగా పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటుచేసిన ప్రత్యేకమైన పార్క్ రద్దీగా ఉండేది. కానీ రానురాను పర్యాటక శాఖ అధికారులు పాలేరుపై శీతకన్ను వేయగా పార్కులు మూతబడ్డాయి. నిర్వహణను గాలికి వదిలేయడంతో మొక్కలు ఎండిపోయి, ఫౌంటెన్లు శిథిలమైన పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ఇక రిజర్వాయర్‌లో బోటింగ్ కోసం తెచ్చిన బోట్లు మూలనపడ్డాయి. పిల్లల పార్కులో ఆట వస్తువులు విరిగిపోయి పనికిరాకుండా పోయాయి. పర్యాటక శాఖ మూడేళ్ల క్రితం పార్కుల అభివృద్ధి, నిర్వహణను స్థానిక గ్రామపంచాయతీకి అప్పగించగా వారు అరకొర నిధులే కేటాయించినా ఆతర్వాత మొత్తానికి వదిలేయడంతో ఇప్పుడు వినియోగంలోకి తీసుకురావడం కూడా కష్టమే అన్న స్థితికి చేరాయి.

అభివృద్ధికి అపార అవకాశాలు

పాలేరును పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు అనేక అవకాశాలు ఉన్నాయి. రిజర్వాయర్‌లోని ఐల్యాండ్స్ అభివృద్ధి చేసి వాటిపై ఫ్యామిలీ రెస్టారెంట్ నిర్మిస్తే పర్యాటకుల రద్దీ పెరుగుతుంది. అలాగే రిజర్వాయర్ వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో హరిత హోటళ్ల మాదిరి రెస్టారెంట్‌తో పాటు విశ్రాంతి భవనం నిర్మిస్తే రాష్ట్రీయ రహదారిపై రాకపోకలు సాగించేవారు ఆగి విశ్రాంతి తీసుకునే అవకాశముంది. అలాగే చిల్డ్రన్స్ పార్కులను ఆటవస్తువులతో తీర్చిదిద్దితే పిల్లలకు ఆటవిడుపుగా ఉంటుంది. వీటన్నింటి ద్వారా పర్యాటక శాఖకు భారీగా ఆఆయం సమకూరే అవకాశముంది. పాలేరు నుండి గెలిచిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెవెన్యూ మంత్రిగా కొనసాగుతున్నందున ఈ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

> **పార్క్‌లు అభివృద్ధి చేయాలి**
>
> పాలేరులో పార్క్‌లు ఒకప్పుడు బాగుండేవి. ఇప్పుడు వాటిని పట్టించుకోకపోవడంతో ఇక్కడకు రావాలంటే జనం ఆసక్తి చూపడం లేదు. పాలేరును మంచి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అనేక అవకాశాలు ఉన్నాయి. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం కూడా సమకూరనున్నందున మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టి సారించాలి.
>
> – విజయ్‌పాల్‌రెడ్డి, పాలేరు

> **ఆదాయం కోల్పోయాం...**
>
> ఒకప్పుడు పాలేరులోని పార్క్‌లకు, బోటింగ్ చేయటానికి జనం బాగా వచ్చేవాళ్లు. ఇప్పుడు పార్క్‌ల పరిస్థితి బాగా లేకపోవడంతో జనం రావటం మానేశారు. బోట్లు మూలన పడ్డాయి. దీంతో మేం ఆదాయం కోల్పోయి ఇతర పనులకు వెళ్లాల్సి వస్తోంది. ఇకనైనా పార్క్‌లను అభివృద్ధి చేసే అటు పర్యాటకులు.. ఇటు మాకు సంతోషంగా ఉంటుంది.
>
> – బత్తుల ఉప్పయ్య, బోట్ రైడర్, పాలేరు





పార్క్‌లో పచ్చదనం లేక కళావిహీనంగా మారిన దృశ్యం, పిల్లల పార్క్‌లో శిథిలమైన ఆట పరికరాలు



మూలన పడిన బోట్లు

వందనంలో పెద్దపులి కలకలం!

పులి కాదని నిర్ధారించిన అటవీ శాఖాధికారులు



వందనంలో రైతు నుంచి వివరాలు సేకరిస్తున్న అటవీ, పోలీసు ఉద్యోగులు

చింతకాని: మండలంలోని వందనం గ్రామంలో పెద్దపులి తిరుగుతోందన్న ప్రచారం గ్రామస్తులను ఆందోళనకు గురిచేసింది. గ్రామానికి చెందిన కౌలు రైతు గాలీబ్ సాహెబ్ పునికి చెరువు పక్కన గంగమ్మ గుడి వద్ద మొక్కజొన్న సాగుచేశాడు. పంటకు నీళ్లు పెట్టేందుకు సోమవారం ఉదయం వెళ్లిన ఆయనకు పులి మాదిరి చారలు కలిగిన జంతువు కనిపించింది. దీంతో పెద్దపులిగా భావించిన సాహెబ్ పరుగున గ్రామానికి చేరుకుని గ్రామపంచాయతీ సిబ్బందికి తెలిపాడు. ఈమేరకు సిబ్బంది, గ్రామస్తులు వచ్చి చూడగా జంతువు జాడ లేకపోగా, వారు ఇచ్చిన సమాచారంతో పోలీసులు, అటవీ శాఖాధికారులు వచ్చారు. పొలంలో పాదముద్రలను పరిశీలించి అవి పులివి కావని, హైనా అనే అడవి జంతువు కానీ పెద్ద అడవి పిల్లి గానీ అయి ఉంటుందని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వేణుమాధవ్, బీట్ ఆఫీసర్లు జ్యోతి, రమేష్, కానిస్టేబుల్ అప్పికట్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వేడుకలో కత్తులతో దాడి

- ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం సరిహద్దు ఏపీలోని ఎటపాక మండలం వెంకటరెడ్డిపేటలో సోమవారం నిర్వహించిన వెంకటేశ్వర స్వామి వారి కల్యాణంలో విషాదం చోటుచేసుకుంది. ఉత్సవాల్లో బండిని పక్కకు తప్పించే క్రమంలో జరిగిన ఘర్షణలో ఓ బాలుడు ప్రాణాలు కోల్పోగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. భద్రాచలంకు కొందరు ఆటోలో వెంకటరెడ్డిపేట వెళ్లారు. ఈ క్రమంలో ఎటపాక మండలం రామగోపాలపురం తండాకు చెందిన అజ్మీర సాయికుమార్, కొరిమి సాయి, నక్కినపోయిన శ్రీనుకు, భద్రాచలం యువకుల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో భద్రాచలం యువకులు కత్తులతో విచక్షణారహితంగా దాడి చేయగా అజ్మీర సాయికుమార్(15)కు తీవ్ర గాయాలయ్యాయి. భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా చికిత్స పొందుతున్నారు. మృతి చెందిన సాయికుమార్‌తోపాటు కొరిమి సాయి నెల్లిపాకలో పదోతరగతి చదువుతూ గౌరిదేవిపేటలో పరీక్షలు రాస్తున్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదుతో ఎటపాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

దండెంపై బట్టలు ఆరవేస్తుండగా ప్రమాదం



సురభి గీత (ఫైల్)

కొణిజర్ల: సంబురంగా హోలీ జరుపుకున్న ఆ కుటుంబంలో గంటల వ్యవధిలోనే విషాదం నెలకొంది. ఉతికిన బట్టలను దండెంపై ఆరవేస్తుండగా విద్యుత్ షాక్ తాకి వివాహిత మృతి చెందడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరైంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు.... మండలంలోని సింగరాయపాలెంకు చెందిన సురభి రాజశేఖర్, గీత(25) దంపతులు ఖమ్మంలో నివాసముంటున్నారు. కొద్ది రోజులుగా రాజశేఖర్ తల్లి ఆరోగ్యం బాగా లేకపోవడంతో వారు ఇద్దరు పిల్లలతో కలిసి ఆదివారం సింగరాయపాలెం వచ్చారు. సోమవారం హోలీ సందర్భంగా బంధువులు, స్నేహితులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ఆతర్వాత ఉతికిన బట్టలను గీత దండెంపై ఆరవేస్తుండగా తీగకు కరెంట్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురైంది. దీంతో కుటుంబీకులు ఖమ్మం తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. అప్పటి వరకు సంతోషంగా హోలీ ఆడిన గీత మృతి చెందిందనే సమాచారంతో బంధువుల్లో విషాదం అలుముకోగా, ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పెనుబల్లి: పెనుబల్లి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి(50) సోమవారం మృతి చెందాడు. సదరు వ్యక్తి రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 వాహనంలో ఆదివారం సాయంత్రం పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేస్తుండగానే ఆయన సోమవారం ఉదయం మృతి చెందాడని వైద్యులు తెలిపారు. కాగా, మృతుడి వివరాలు తెలిసిన వారు సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని వైఎస్సార్ ఆర్చి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. నగరానికి చెందిన ఎం.జాన్‌పాషా(51) ఈనెల 16న మసీదుకు వెళ్లడానికి ద్విచక్రవాహనంపై బయలుదేరగా, గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన పాషాను అదేరోజు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఆయన కుమారుడు అక్తర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగిన మహిళ...

తల్లాడ: మండలంలోని బస్వాపురానికి చెందిన మహిళ అనారోగ్యంతో బాధపడుతూ పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. గ్రామానికి చెందిన ఎస్.కె.రంజాన్‌బీ(41) భర్త ఆరేళ్ల క్రితం మృతి చెందగా, ఇద్దరు కుమార్తెల వివాహం జరిపించింది. రెండు నెలల క్రితం ఆమె ఆస్పత్రిలో పరీక్ష చేయించుకోగా కామెర్ల వ్యాధి సోకినట్లు నిర్ధారించారు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ఆమె వ్యాధి తగ్గుతుందో, లేదోనన్న బాధతో ఈనెల 18న పురుగుల మందు తాగగా స్థానికులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా, రంజాన్‌బీ సోదరుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కొండల్‌రావు తెలిపారు.

యూపీహెచ్ కాలనీలో వివాహిత...

ఖమ్మం అర్బన్: ఖమ్మం యూపీహెచ్ కాలనీకి చెందిన వివాహిత ఆంగోతు మంగమ్మ(35) పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఖమ్మం అర్బన్ పోలీసుల కథనం ప్రకారం.. మంగమ్మ కూలీ పనులు చేస్తూ కుటుంబంతో సహా యూపీహెచ్ కాలనీలో ఉంటుంది. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆమె ఈనెల 19న పురుగుల మందు తాగగా, కుటుంబీకులు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందడంతో ఆమె సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మిల్లులో కూలిన గోడ.. తప్పిన ప్రమాదం



కూలిన మిల్లు గోడ

నేలకొండపల్లి: మండల కేంద్రానికి సమీపాన ఉన్న సాయిలక్ష్మి పారాబాయిల్డ్ రైస్‌మిల్లులో సోమవారం ప్రమాదవశాత్తు గోడ కూలగా.. ఆ సమయాన హమాలీలు, రైతులు దూరంగా ఉండడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. యాసంగి ధాన్యం విక్రయించేందుకు మిల్లుకు పెద్దసంఖ్యలో రైతులు వచ్చాయి. ఈమేరకు హమాలీతో కలిసి ఆరుబయట మాట్లాడుతుండగా మిల్లు మిల్లు గోడ కూలి యంత్రాలపై పడింది. దీంతో ఆస్తినష్టం జరగగా, రైతులు దూరంగా ఉండడంతో ఊపిరి పీల్చుకున్నారు. అయితే, గోడ కూలే సమయాన పెద్దశబ్దం రావడంతో రైతులు, హమాలీలు పరుగులు తీశారు.

బైక్‌కు కారు తగిలిందని వివాదం



రెండు వర్గాల వారు గొడవ పడుతున్న దృశ్యం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో సోమవారం రెండు వర్గాల యువత వీరంగం సృష్టించారు. బైక్‌ను కారు తాకడంతో మొదలైన వివాదం తారాస్థాయికి చేరగా, పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. మండల కేంద్రంలోని ఓ దుకాణం వద్ద ఉన్న బైక్‌ను కూసుమంచి మీదుగా వచ్చిన సూర్యాపేటకు చెందిన వారి కారు తాకిందంటూ బైక్‌పై యువకులు వాదనకు దిగారు. ఈ గొడవ పెద్దది కావడంతో అరుపులు, కేకలు, తోపులాటతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. చివరకు స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు చేరుకుని ఇరువర్గాల వారిని స్టేషన్‌కు తరలించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో సోమవారం శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు(30) మృతి చెందాడు. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నుండి సికింద్రాబాద్ వెళ్తున్న శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు ఎర్రుపాలెం స్టేషన్‌లో ప్లాట్‌ఫాంపైకి వస్తుండగా, సదరు యువకుడు పట్టాలు దాటుతుండడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



హోమంలో పాల్గొన్న సివిల్ జడ్జి రామారావు దంపతులు

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లిలో కొలువైన శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలు మూడో రోజు చేరుకోగా, సోమవారం ఆలయంలో స్వామివారికి తెల్లవారుజాము నుంచే సుప్రభాతసేవ, అర్చనలు, గోత్రనామార్చనలు, ధూప దీప నైవేద్యాలు, హోమాలు, నిత్య పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి కావాల్సిన పసుపు దంచే కార్యక్రమం(ఉలవకళ్ల ఉత్సవం) నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా తలంబ్రాలను కలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని కొత్తగూడెం సివిల్ జడ్జి రామారావు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాగా శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారి ఆలయంలో చండీ హోమం నిర్వహించారు.

ఘనంగా కల్యాణం

శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. వివిధ రకాల పూలలు, విద్యుత్‌దీపాలతో ఆలయ ప్రాంగణాన్ని అలంకరించగా, అర్చకులు మంగళవాయిద్యాలతో శాస్త్రోక్తంగా కల్యాణ వేడుక జరిపించారు. ఆలయ మేనేజర్ రమణ, భక్తులు మారగాని శ్రీనివాసరావు, వనమా వెంకటేష్ దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు గిరిధరాచార్యులు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ వనమా గాంధీ, వేముల రమణ, కల్లోజి వెంకటేష్, పర్సా వెంకటేశ్వర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెండు రాష్ట్రాలస్థాయి ఎడ్ల పందేలు



ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్ల యజమానికి బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాలెంలో అంకమ్మతల్లి, అక్కమ్మ పేరంటాల రామలింగేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా నిర్వహించిన రెండు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలు సోమవారం ముగిశాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి 20జతల ఎడ్లు పోటీల్లో పాల్గొనగా.. బనిగండ్లపాలేనికి చెందిన తల్లపురెడ్డి అంకాళ్లరెడ్డి ఎడ్లు 2,601 అడుగులు లాగి ప్రథమ బహుమతి రూ.30 వేల నగదు గెలుచుకున్నాయి. అలాగే, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా కంచకచర్లకు చెందిన షేక్ హజ్మీయా, తల్లపురెడ్డి రాంరెడ్డి, మధిరకు చెందిన మోహన్, తాళ్లూరుకు చెందిన నాగేశ్వరావు, తొట్ల ఉట్లూరుకు చెందిన ఆర్‌బీఎస్, జూపూడికి చెందిన వెంకటేశ్వరావు, ఆళ్లూరి నాగేశ్వరరావు, రాఘవాపురానికి చెందిన రాంరెడ్డి, చిన్నపుటికకు చెందిన ఆర్‌పీ బుల్స్ ఆతర్వాత స్థానాల్లో నిలిచాయి. ఆలయ కమిటీ సభ్యులు, దాతలు సాయికుమార్, ఝున్నం సత్యనారాయణరెడ్డి, నీలం రవికుమార్, శీలం రవీంద్రరెడ్డి, వెంకటనారాయణ పాల్గొన్నారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు



అంత్యక్రియల నిమిత్తం మృతదేహాలను తీసుకెళ్తున్న ఫౌండేషన్ చైర్మన్, సిబ్బంది

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మార్చురీలో ఉన్న మూడు అనాథ మృతదేహాలకు అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యాన సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఖమ్మం జీఆర్పీ స్టేషన్ పరిధిలో ఇటీవల ఇద్దరు వ్యక్తులు రైలు ఢీకొని మృతి చెందారు. అలాగే, మహబూబాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందగా ముగ్గురి మృతదేహాలను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. వీరి మృతదేహాల కోసం ఎవరూ రాకపోవడంతో రైల్వే పోలీసులు ఇచ్చిన సమాచారంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ఆధ్వార్యన సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.

అల్లాడుతున్న ఆలమంద



నీటి కుంటలో దాహార్తి తీర్చుకుంటున్న పశువులు

ఓ వైపు వేసవి తాపం పెరుగుతోంది. మరోవైపు చెరువులు, నీటి కుంటలు ఎండిపోతున్నాయి. దీంతో గుక్కెడు నీళ్లు దొరకక మూగజీవాలు అల్లాడుతున్నాయి. ఎండ తీవ్రతకు ఎక్కడ నీళ్లు కనిపిపించినా మూగజీవాలు పరుగులు పెట్టి దాహం తీర్చుకుంటున్నాయి. సోమవారం అశ్వారావుపేట మండలం మేకలబండ గ్రామ అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన పశువులు దాహంతో ఒక్కసారిగా నీటికుంట వైపు పరుగులు పెట్టి దాహార్తి తీర్చుకుంటున్న దృశ్యమిది. – అశ్వారావుపేటరూరల్